క్లుప్తంగా

అభ్యర్థుల జాబితా విడుదల



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికల తుది జాబితాను ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, విజయలక్ష్మీలు విడుదల చేశారు. అధ్యక్ష, కోశాధికారి, గ్రంథాలయ కార్యదర్శికి పదవులకు ఇద్దరు చొప్పున పోటీ పడుతున్నారని తెలిపారు. ఈనెల 29న ఎన్నికలు జరగనున్నాయన్నారు. అలాగే ఉపాధ్యక్ష పదవికి జగన్, ప్రధాన కార్యదర్శిగా అశోక్, సంయుక్త కార్యదర్శిగా జేడీ మధుసూదన్, మహిళా ప్రతినిధిగా సవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు.

మామిడిపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మాక్లూర్: మండలంలోని మామిడిపల్లిలో శుక్రవారం సీఎస్ఐ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించారు. సర్పంచ్ చింత మల్లారెడ్డి, ఎంపీటీసీ సత్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించగా విద్యార్థులు మొదటి రోజుగా గ్రామంలోని అంతర్గత రోడ్లను శుభ్రం చేశారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణ



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం రెవెన్యూ అధికారులు శుక్రవారం దరఖాస్తులు స్వీరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు, ఆధార్, ఆహార భద్రత కార్డు, పాత రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకున్నారు. మొదటి రోజు 151 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం, సోమవారం కూడా దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు.

‘డబుల్’ బిల్లుల పంపిణీ



వర్ని: మండలంలోని సైదిపూర్ గ్రామంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ బిల్లులను శుక్రవారం వర్ని మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్ పంపిణీ చేశారు. గ్రామంలో 8 మంది లబ్ధిదారులకు రూ.8.80 లక్షల బిల్లులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్ని మండల అధ్యక్షుడు కల్లాల్ గిరి, సర్పంచ్ రేణుక రవి, ఉపసర్పంచ్ రూప్సింగ్ పాల్గొన్నారు.

అబాకస్‌లో ప్రతిభ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో లోటస్ స్మార్ట్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పవార్ అంబిక తెలిపారు. విశ్వం ఎడ్యుటెక్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్మూర్ డివిజన్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు.

దంత వైద్య శిబిరం



రుద్రూర్: చందూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా కేంద్రానికి చెందిన దంత వైద్యుడు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. మూడు వందల మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసి అవసరమగు మందులు, టూత్ పేస్టులు పంపిణీ చేశారు.

గుంత పూడ్చివేత

నవీపేట: కమలాపూర్ మూల మలుపు రోడ్డు దగ్గర ప్రమాదకరమైన గుంతను పూడ్చాలని ఈ నెల 9న సాక్షి జిల్లా టాబ్లాయిడ్‌లో అటెన్షన్ ప్లీజ్ పేరిట వార్తా కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించి గుంతను అధికారులు పూడ్చారు. ఈ మూల మలుపు గుండా కమలాపూర్, నారాయణ్‌పూర్, మోకన్‌పల్లి, జలాల్‌పూర్, అనంతగిరి, నిజామాబాద్ వరకు వెళ్తారు. రాత్రి వేళల్లో ఈ గుంతలో పడి పలువురు గతంలో గాయాల పాలయ్యారు.

చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం



పిప్రి ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ



రెంజల్‌లో.. ఎంపీడీవో శంకర్



నందిపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి

సాక్షి నెట్‌వర్క్: చిరుధాన్యాల ప్రాముఖ్యత, వాటిలో లభించే పోషకాల గురించి జిల్లాలో పలు చోట్ల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా అధికారులు వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కచ్చితంగా చిరుధాన్యాలు తీసుకోవాలని, వాటిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. ప్రతి మహిళ పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాగులు, జొన్నట్లు, సజ్జలు, శనగలు, వంటి చిరు ధాన్యాల్లో రోగ నిరోధక శక్తి అధికంగా లభిస్తుందని, ప్రతి ఒక్కరూ వాటిని అలవాటు చేసుకోవాలని సూచించారు. నందిపేట మండల కేంద్రంలోని రైతువేదికలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, రెంజల్‌లో ఎంపీడీవో శంకర్, ఆర్మూర్ మండలం పిప్రిలో అంగన్వాడీ సూపర్ వైజర్ వెంకటరమణమ్మ చిరుధాన్యాలపై వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.

మాక్లూర్‌లో విండో 81వ మహాజన సభ



81వ మహాజన సభలో చైర్ పర్సన్, డైరెక్టర్లు

మాక్లూర్: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్ పర్సన్ గోప్ప లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మండల కేంద్రంలోని సంఘ భవనంలో 81వ మహాజన సభ జరిగింది. అనంతరం సంఘం లావాదేవీలను కార్యదర్శి సంతోష్ విన్పించారు. గత వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించామని, ఈ సారి కూడా అదే తరహాలో కొనుగోలు కేంద్రాల నిర్వహణకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బొంకన్‌పల్లి రైతుల కోరిక మేరకు రూ.15 లక్షల వ్యయంతో మరో మినీ గోదాము నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. మహాజన సభలో విండో వైస్ చైర్మన్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

నవీపేట: సీఎం కేసీఆర్ ఇచ్చిన రూ.లక్ష రుణ మాఫీని ఏక కాలంలో వర్తింపజేయాలని ఫకీరాబాద్‌లో జరిగిన నాగేపూర్ సొసైటీ మహాజన సభలో రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సొసైటీ చైర్మన్ శైలేశ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సభలో పలు అభివృద్ధి పనులపై చర్చించి ఏక గ్రీవంగా తీర్మానాలు రూపొందించారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. వైస్ చైర్మన్ సత్యంరెడ్డి, సీఈవో రమేష్, సిబ్బంది రాజశేఖర్, రఫీ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దుపై నిరసనలు



ఆర్మూర్‌టౌన్/రుద్రూర్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా నిరసనలకు దిగాయి. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను ఆర్మూర్ పట్టణంలో, కోటగిరి మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలు దహనం చేశారు. ప్రతిపక్ష నాయకులపై కక్ష్య సాధింపు ధోరణితో వ్యవహరించడం అప్రజాస్వామికమని అన్నారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలి



ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం సకాలంలో వేతనాలు చెల్లించాలని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీపీ కార్మికుల వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు రూ.16,500, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనాలు ఇవ్వాలన్నారు.

మాక్లూర్: మాక్లూర్ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, మండల అధ్యక్షులు కలగడ్డ వినోద్ కుమార్, జిల్లా నాయకులు గంగొని సంతోష్ ,గంగోని వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో రూ.35 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సర్పంచ్ పద్మ శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేశ్వర్, కార్యదర్శి నర్సయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

మాక్లూర్: కొత్తపల్లిలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం సర్పంచ్ వేములపల్లి సుబ్బారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రసాద్, వార్డు సభ్యులు, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న సీడీపీవో జానకి

బోధన్‌రూరల్(బోధన్): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి, సీడీపీవో జానకిలు కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల బాలల పరిరక్షణ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో బా లలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి ని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, అక్రమ రవాణ వంటి అంశాలను నిరోధించేందుకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలన్నారు. ఎస్సై పీట ర్, ఎంఈవో నాగనాథ్, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్యేక జిల్లా ఏర్పాటుపై స్పందించాలి



బోధన్: పురాతన, చారిత్రిక ప్రాముఖ్యత కలిగిన బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికార పక్ష ప్రజాప్రతినిధులు స్పందించాలని న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు తమ ఉద్యమానికి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక జిల్లా ప్రకటించాలనే డిమాండ్‌తో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 96వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు గంగారెడ్డి, శంకర్‌లు కూర్చున్నారు. న్యాయవాది శ్రీనివాస్ దీక్షలను ప్రారంభించి మాట్లాడారు.

ఆర్మూర్ పట్టణంలో స్వచ్ఛ మషాల్ మార్చ్



ఆర్మూర్‌టౌన్: ఐక్యరాజ్య సమితి మార్చి 29ని అంతర్జాతీయ జీరో వేస్ట్ డేగా ప్రకటించిందని అందులో భాగంగా స్వచ్ఛ మషాల్ మార్చ్ ర్యాలీని మున్సిపల్ పరిధిలోని ప్రతి ఒక్క వార్డులో నిర్వహించాలని ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పూర్ణమౌళి అన్నారు. ఆర్మూర్ పట్టణంలో మహిళ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై స్వచ్ఛ మషాల్ మార్చ్ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు.

డిజిటల్ లావాదేవీలను అలవాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్

ఎడపల్లి(బోధన్): గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలకు అలవాటు పడాలని డీఆర్‌డీవో చందర్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలో డిజిటల్ అక్షరాస్యత, డిజిటల్ చెల్లింపులు, బ్యాంక్ లావాదేవీలు అనే అంశాలపై డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఆర్‌డీవో హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి రంగంలో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తుందన్నారు. డిజిటల్ చెల్లింపులు జరపడంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా డ్వాక్రా మహిళలు తీసుకునే రుణాలతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ వ్యాపారంలో లాభాలు గడించాలన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్, స్థానిక ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో గోపాలకృష్ణ, తహసీల్దార్ ఆకుల శేఖర్, మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వర్, ఎడపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల మాధవి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు రుద్రూర్‌లో మహిళా యోగా శిబిరం

రుద్రూర్: రుద్రూర్‌లోని శ్రీ నగేశ్వర మందిరంలో శనివారం మహిళా యోగా శిబిరం నిర్వహిస్తున్నట్లు పతంజలి యోగా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మంజుశ్రీ, ఎంపీపీ అక్కపల్లి సుజాత హాజరవుతున్నారని పేర్కొన్నారు.

■ రిజర్వాయర్ పనులు పరిశీలించనున్న స్పీకర్

వర్ని: వర్ని మండలంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరిశీలించనున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లాల్ గిరి వెల్లడించారు. పనులపై అధికారులతో ప్రాజెక్టు వద్ద స్పీకర్ సమీక్షించనున్నారని తెలిపారు.

ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులు



సాలూర ఎంపీపీ చేతుల మీదుగా సర్పంచ్‌లకు ప్రశంసా పత్రాలు



నవీపేటలో సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్



మెండోరా మండల కేంద్రంలో ..

ఉత్తమ జాతీయ గ్రామ పంచాయతీల అవార్డులకు ఎంపికైన బోధన్, ఆర్మూర్, బాల్కొండ పరిధిలోని గ్రామాలకు అవార్డులను శుక్రవారం ప్రదానం చేశారు. తొమ్మిది అంశాలలో ఉత్తమ సేవలు అందించిన సర్పంచ్‌లను ఎంపీడీవోలతో పాటు ఎంపీపీలు, ఇతర అధికారులు సన్మానించారు. పాలకవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్

పంచాయతీల ఎంపికపై నిలదీత



రెంజల్(బోధన్): అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నా కనిపించడం లేదా అని పలువురు సర్పంచ్‌లు ఎంపీడీవోను నిలదీశారు. జాతీయ గ్రామ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మండలంలోని 17 పంచాయతీలు ఉండగా 5 పంచాయతీలను ఉత్తమ జీపీలుగా ఎంపిక చేసి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన పలు గ్రామాల సర్పంచ్‌లు మధ్యలో నుంచి వెళ్లిపోయారు. ఉత్తమ పంచాయతీలను ఎలా ఎంపిక చేశారని ఎంపీడీవో శంకర్‌ను ప్రశ్నించారు. పారదర్శకంగా ఎంపిక జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలి

నవీపేట: ఎల్‌కే ఫారమ్ గ్రామానికి చెందిన సొసైటీ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ వీర్‌సింగ్‌కు బీజేపీ నాయకులు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. క్రిస్టియన్‌గా మతం మార్చుకుని ఇంకా ఎస్సీగానే కొనసాగుతున్నారని, ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందుతున్నాడని పేర్కొన్నారు. సమగ్ర విచారణ జరపాలని కోరారు. గ్రామానికి చెందిన తండ్రీ, కుమారులపై ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, మండల నాయకులు వంశీ మోహన్, బందెల ఆనంద్, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, భానుగౌడ్ పాల్గొన్నారు.

కోర్టును ఆశ్రయిస్తా: ప్రవీణ్

నవీపేట: తనపై బీజేపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని, తనకు జరిగిన అవమానంపై కోర్టును ఆశ్రయిస్తానని నవీపేట సొసైటీ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. గ్రామంలో జరిగిన చిన్న ఘటనను ఆసరాగా చేసుకున్న బీజేపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నా రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక మతం ముసుగులో రాజకీయం చేస్తున్న వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోర్టును ఆశ్రయిస్తానని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు తెడ్డు పోశెట్టి, మాజీ ఎంపీపీ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాచరిక పాలన



మాట్లాడుతున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు

వర్ని: తెలంగాణ రాష్ట్రంలో రాచరిక పాలనను కేసీఆర్ కొనసాగిస్తున్నారని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సందగిరి రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. వర్నిలో భారతీయ జనతా యువమోర్చా మండల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులను సీఎం పట్టించుకున్న పాపాన పోలేదని, నిరసనగా ఈనెల 25న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న నిరుద్యోగుల మహా ధర్నాకు జిల్లా నుంచి బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ అంటే బాకీల రాష్ట్ర సమితి తయారైందని ఆయన ఎద్దేవా చేశారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్, విజయకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకాంత్, జిల్లా అధికార ప్రతినిధి మహేష్, బీజేవైఎం నాయకులు ప్రవీణ్, నిఖిల్, సుధాకర్ ,విగ్నేష్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సాలంపాడ్ క్యాంప్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి

బోధన్‌రూరల్(బోధన్): ప్రొద్దు తిరుగుడు పంటను పండించిన రైతులు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డిలు అన్నారు. శుక్రవారం సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్, కుమ్మన్‌పల్లి గ్రామాల్లో సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రొద్దు తిరుగుడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారులకు అమ్మి నష్టపోవద్దన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు రూ.6,400లు మద్దతు ధర లభిస్తుందన్నారు. సొసైటీ చైర్మన్ బ్రహ్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ షకీల్, ఎంపీటీసీ వెంకట్రావు, బీఆర్‌ఎస్ నేత తూము రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఆవుల శివారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం





బాల్కొండ: నాగాపూర్‌లో వేంకటేశ్వరుని కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో మంత్రి వేముల

వేల్పూర్: మండల కేంద్రంలోని జంబి హనుమాన్ దేవాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆయన సతీమణి నీరజారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదపండితుల ఆశీర్వాదం పొందారు. డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, ఎంపీపీ బీమ జమున, సర్పంచ్ రాధామోహన్ పాల్గొన్నారు.

కౌల్‌పూర్ ఆశ్రమంలో చండీహోమం

నందిపేట్(ఆర్మూర్): కౌల్‌పూర్‌లోని భూమయోగేశ్వర ఆశ్రమంలో శ్రీరామ నవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా శనివారం ఆశ్రమ భక్తులు మాలధారణ చేసి కలశ పూజ నిర్వహించారు. అలాగే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం చండీ హోమం చేశారు. ఈ ఉత్సవాలు శ్రీరామ నవమి వరకు కొనసాగుతాయని ఆశ్రమ వ్యవస్థాపకులు చింత రమేష్ స్వామి తెలిపారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



వీరన్నగుట్టలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ బైండ్ల రాజు



వాడిలో ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపు మహేశ్

రెంజల్(బోధన్): వీరన్నగుట్టలో శుక్రవారం కంటి వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ బైండ్ల రాజు ప్రారంభించారు. డాక్టర్ వినయ్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు రవీందర్, శ్రావణ్ పాల్గొన్నారు.

వాడి గ్రామంలో..

వేల్పూర్: వాడి గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ గోపు మహేశ్ ప్రారంభించారు. గ్రామస్తులంతా కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

వేణుకిసాన్‌నగర్ తండాలో..

మాక్లూర్: వేణుకిసాన్‌నగర్ తండాలో మండల వైద్యాధికారి సరిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ రమేష్‌నాయక్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన వృద్ధులు పెద్ద సంఖ్యలో చేరుకొని కంటి సరీక్షలు చేయించుకున్నారు.